బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో..


# మనం ఇహలోక వాసులమా? పరలోక వాసులమా?



తటవర్తి వీరరాఘవరావు

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా?



రచన & ప్రచురణ : **తటవర్తి వీరరాఘవరావు**


ప్రథమ ముద్రణ : మే, 2013
ప్రతులు : 4,000

ద్వితీయ ముద్రణ : మే, 2014
ప్రతులు : 3,000

తృతీయ ముద్రణ : మార్చి, 2021
ప్రతులు : 1,000


వెల : **రూ. 30/-లు**



**పుస్తకముల కొరకు**

**తటవర్తి వీర రాఘవరావు**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**
**సెల్ : 9490171853, 9440309812**
email : balajipyramid.bvrm@gmail.com



# ధ్యానం చేసే పద్ధతి
# శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన **ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం** నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

**ప్రవేశం** : మూడురోజులకు భోజనం, వసతి ఉచితం

**వేదిక** : శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.

వివరాలకు : **తటవర్తి వీరరాఘవరావు,** తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94403 09812, 94901 71853

# మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా?

ముఖ్యంగా మనం ఈ విషయం గురించి ఆలోచించాలి. ఎందుచేతనంటే సృష్టిలో రెండు రకాల లోకాలు వున్నాయి. 1. ఇహ లోకము 2. పరలోకము. కనబడే ఈ భూలోకాన్ని ఇహలోకమంటారు. కనబడని లోకాల్ని పరలోకం అంటారు. దేవుళ్ళు, దేవతలు పరలోకంలో వుంటారంటారు.

ఇంతకీ మనం ఏ లోకానికి చెందినవారం? ఏ లోకవాసులం? ఇహలోక వాసులమా? పరలోక వాసులమా? ఈ విషయం తప్పనిసరిగా ఆలోచించవలసిన అవసరం వుంది. కారణం మనం ఇహలోకవాసులమైతే ప్రస్తుతం మనమంతా ఆలోచించే... జీవించే విధానం ఒక రకంగా సరైనదే. కాని మనం నిజంగా పరలోక వాసులమే కనుక అయితే, మనం ఆలోచించవలసిన, జీవించవలసిన విధానం వేరే విధంగా వుంటుంది. అందుచేత తప్పనిసరిగా మనం ఈ విషయం గురించి ఆలోచించి నిర్ధారణ చేసుకోవాలి. ఎందుచేతనంటే ఎవరి ప్రవర్తన చూసినా తాము ఇహలోక వాసులమన్నట్టుగానే వుంది.

అంటే అంతా తాము భూలోకవాసులైనట్టు, ఇక్కడే శాశ్వతంగా వుండిపోయే వారమన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. ఇక్కడ వున్నవాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. అంటే భూలోక సంపదలు, భోగభాగ్యాలు, పదవులు, పేరుప్రతిష్టలు సంపాదించడానికి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వడమే కాదు, వాటిని సంపాదించటానికి జీవితమంతా కృషిచేస్తున్నారు, కష్టపడుతున్నారు. వాటి కోసం అధర్మంగా వ్యవహరిస్తున్నారు. పాపాలు కూడా చేస్తున్నారు. కారణం తామంతా ఇక్కడి వారన్నట్టు, శాశ్వతంగా ఇక్కడే వుండిపోయేవారన్నట్టుగా భావిస్తున్నారు. అంతేకాదు ఇక్కడ తమకు వున్నవన్నీ తమవైనట్టు, ఇవన్నీ శాశ్వతమైనట్టు భ్రమ పడుతున్నారు.

ఇంకా ఇక్కడ వున్నవారిలో కొందరు తమ బంధువులన్నట్టు, కొందరు శత్రువులన్నట్టు, మరికొందరు మిత్రులన్నట్టు భావిస్తున్నారు. ఇక్కడ ఏదైనా వస్తుంటే వస్తుందని సంబరపడిపోతున్నారు, పోతుంటే పోతుందని బాధపడుతున్నారు. ఇతరులను చూసి అసూయపడుతున్నారు, అవి నాకు లేవే అని బాధపడుతున్నారు. ఎందులోనైనా విజయం సాధిస్తే గెలిచేనని పొంగిపోతున్నారు. ఓడిపోతే అవమానంతో కుంగిపోతున్నారు. ఇంకా అంతా వేరు వేరు అనుకుంటూ తాను, తమవారు బాగా వుండాలనుకుంటారు, అందరికంటే గొప్పగా జీవించాలనుకుంటారు. దాని కోసం ఇతరులను మోసగిస్తున్నారు, తక్కువగా చూస్తున్నారు, అవమానిస్తున్నారు,

కష్టాలకు గురి చేస్తున్నారు. వారు ఏమైపోయినా లెక్క చేయడం లేదు. ఇవన్నీ చూస్తే తామంతా 'భూలోకవాసులమని' అనుకుంటున్నట్టుగా వుంది.

ఇంతకీ అసలు మనం ఏ లోక వాసులం? ఏ లోకానికి చెందిన వారం? ముఖ్యంగా మనం భూలోక వాసులమా? కాదా? అన్నది ఆలోచించాలి. ఎందుచేతనంటే ఒకవేళ మనమే కనుక భూలోక వాసులం కాకుండా పరలోక వాసులమయితే మనం చేయవలసిన పనులు వేరే విధంగా వుంటాయి. ఆలోచించవలసిన విధానం వేరే వుంటుంది.

మరి మనం ఏ లోక వాసులమో అంటే ఏ లోకానికి చెందిన వారమో తెలియాలంటే ముందు మనమెవరో తెలుసుకోవాలి. ఎందుచేతనంటే ఇప్పటి దాకా చాలా మంది అభిప్రాయం తాము మానవులమని, కనపించే ఈ దేహమే తామని భావిస్తున్నారు. అందుచేత ఈ దేహానికి ఒక పేరు అంటే సుబ్బారావో... అప్పారావో.. పాపారావో.. ఇలా ఎవరికి నచ్చిన పేరు వారు పెట్టుకుని ఆ పేరు కూడా తామనుకుంటున్నారు.

ఆ పేరును ఎవరైనా పొగిడినా, ప్రశంసించినా పొంగిపోతారు, ఉబ్బి తబ్బిబ్బైపోతారు. ఆ పేరును ఎవరైనా తిట్టినా, విమర్శించినా, దూషించినా బాధపడతారు, కుంగిపోతారు, కోపగించుకుంటారు. తిరిగి ఏదో రకంగా దానికి తగ్గ సమాధానం చెపుతారు. మరల తిట్టడమో? ఏదో విధమైన ప్రతీకార చర్య చెయ్యడమో చేస్తారు. కారణం వాడు తనను తిట్టాడు కాబట్టి, విమర్శించాడు కాబట్టి.


ఇదంతా దేని కంటే కనిపించే దేహం తానని భావించబట్టే. అంతేకాదు ఆ దేహం గురించి ఎంతో పాటు పడుతూంటారు. కష్టపడుతూంటారు. కారణం ఆ దేహాన్ని సుఖ పెట్టాలని, అందంగా వుంచాలని, ఆరోగ్యంగా ఆకర్షణీయంగా వుంచాలని, జీవించినంత కాలం దేహానికి ఏ లోటు రాకూడదని, ఎంతో తపన పడతారు, తాపత్రయపడతారు. వీటన్నిటి కోసం ధనం కావాలి కాబట్టి, ధనం సంపాదించటానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.

అందుకే ధన సంపాదనకు రోజులో ఎక్కువ సమయం కేటాయిస్తారు. ధన సంపాదనే తన జీవిత లక్ష్యంగా భావిస్తారు. కారణం ధనం వుంటేనే దేహాన్ని సుఖపెట్టగలరు, పెద్ద పెద్ద భవంతులలో వుంచగలరు. ఎ/సి.లలో, లావు లావు పరుపుల మీద పడుకోపెట్టగలరు, పెద్ద పెద్ద కార్లలో తిప్పగలరు. మంచి, మంచి రుచికరమైన భోజనాలు తినిపించగలరు. సినిమాలు, టి.వి.లు చూపించగలరు. సెంటు, అగరబత్తీ లాంటి సువాసనలు ఆస్వాదించగలరు. అద్భుతమైన సంగీతం వినగలరు. ఇవన్నీ దేహానికి సంబంధించినవే, దేహాన్ని సుఖపెట్టేవే. మరి వీటన్నిటికి

కావలసింది ధనం కాబట్టి ... ఆ ధన సంపాదనకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. ధనం పట్ల విపరీతమైన వ్యామోహం కలిగి వున్నారు. కారణం తాను దేహమని భావించబట్టే.

అందుకే ధన సంపాదనకు చేయకూడని పనులు చేస్తున్నారు. రకరకాల మోసాలు చేస్తున్నారు. అధర్మంగా ప్రవర్తిస్తున్నారు. అక్రమంగా, అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. తమ శక్తియుక్తులు, తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. ఎంతసేపూ "ఎంత సంపాదించామా? అని చూస్తున్నారు కానీ ఎలా సంపాదించాము? అని చూడటం లేదు". మరి ఇన్ని రకాల తప్పులు, పాపాలు చెయ్యటానికి ముఖ్య కారణం తాము దేహమని భావించబట్టే. తాము దేహమనే భావంలో వుండబట్టే.

కానీ ప్రపంచంలో ఈ భావమే కనుక లేకపోతే అంటే దేహమే నేననే భావం లేకపోతే ప్రపంచంలో ఇన్ని అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, మోసాలు జరగవు. ఇన్ని అరాచకాలు వుండవు. ప్రపంచం ఈ స్థితిలో వుండదు. మానవుల ప్రవర్తన మరో విధంగా వుండేది. అందుచేత తప్పనిసరిగా ముందు ఇది నిర్ధారణ చేసుకోవాలి. అసలు నేను ఎవరు?



అందుకే రమణ మహర్షి గారు ప్రతి ఒక్కరిని "నువ్వెవరో తెలుసుకో!" అని చెప్పేవారు. ఆయన దగ్గరకు ఎవరు ఏ సమస్యతో వెళ్ళినా... ఏ కష్టం గురించి వెళ్ళినా... ఏ సలహా కోసం వెళ్ళినా... ముందు ఈ సలహా ఇచ్చే వారు అదేమిటంటే! "నువ్వెవరో తెలుసుకో!". ఆయన అస్తమాను అలా అంటూంటే చాలా మందికి అర్థం అయ్యేది కాదు. ఏమిటి? ప్రతీ దానికి ఈయన ఇలా అంటున్నాడు? అని అనుకునేవారు. కానీ ఆయన తెలివి తక్కువ వాడు కాదు. అదే మాట పదే పదే అనటానికి కారణం తెలీక కాదు. ఎందుచేతనంటే ఆయన గొప్ప జ్ఞాని, ఆయనకు అన్నీ తెలుసు. అందులోనే అంతా వుందని తెలుసు. మానవుని ప్రతీ సమస్యకు పరిష్కారం అందులోనే వుందని, మానవుడు ముందు అది తెలుసుకోవాలని, అది తెలుసుకోలేకపోతే మానవునకు ఏదీ అర్థం కాదని కూడా

ఆయనకు తెలుసు. అందుకే ఆయన ముందు "నువ్వెవరో తెలుసుకో!" అని సలహా ఇచ్చేవారు.

దీనిని బట్టి ఆయన సలహాలోఎంత అర్థం దాగి వుందో, అందులో ఎంత రహస్యం దాగి వుందో మనకు అర్థమవుతుంది. అందుచేత మనం కూడా ముందు మనమెవరో తెలుసుకోవాలి. ఇది చాలా చాలా ముఖ్యం.

మరి మనమెవరో మనకు ఎలా తెలుస్తుంది? కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది. ఎందుచేతనంటే మనమంతా మానవులమే సందేహం లేదు. కాని మానవుడంటే కనిపించే దేహం ఒక్కటే కాదు, దేహంతో పాటు కనిపించని 'మనస్సు' వుంది, కనిపించని 'ఆత్మ' కూడా వుంది. అంటే 'దేహము, మనస్సు, ఆత్మ' మూడు కలిపి మానవుడు. అంతే కాని, దేహం ఒక్కటే మానవుడు కాదు.

అందుచేత ఈ మూడింటిలో నేను ఎవరు? అన్నది తెలుసుకోవాలి. అంటే దేహం నేనా? మనస్సు నేనా? ఆత్మ నేనా? లేక మూడూ కలిపి నేనా? ముందు ఈ విషయం నిర్ధారణ చేసుకోవాలి. అప్పుడే ఏదైనా మనకు అర్థమవుతుంది. ఇ ది తెలుసుకోవాలంటే దాని కంటే ముందు మరొక విషయం తేల్చుకోవాలి.

అసలు నేను చనిపోయిన తరువాత ఇంకా వుంటానా? వుండనా? అంటే నాకు ఇంకా జీవితం వుందా? లేదా? అంటే ఇంకా జన్మలు వున్నాయా? లేవా? అన్నది ముందుగా తేల్చుకోవాలి. ఇది తెలియాలంటే అందరికంటే గొప్పవాడైన శ్రీకృష్ణభగవానుడు చెప్పిన భగవద్గీతను చూడాలి. గీతలో

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మమృతస్య చ।**
**తస్మాత్ పరిహార్యేర్థేన త్వం శోచితు మర్హసి॥ (భ.గీ.2-27)**

తా:- ఏ విధంగా చూసినప్పటికీ జన్మించినవాడికి మరణం తప్పదు. మరణించినవాడు మరల జన్మించక తప్పదు. మరో మార్గం లేని ఈ విషయంలో దుఃఖించడం నీకు తగదు.

దీనిని బట్టి మరణించిన తరువాత ప్రతీ ఒక్కరూ ఇంకా వుంటారని తెలుస్తుంది. మరి మరణించేది ఏది? మరణించేది దేహము, దేహంతో పాటు మనస్సు మాత్రమే. ఎందుచేతనంటే మనస్సు దేహంతో పాటు వస్తుంది, దేహంతో పాటు పోతుంది. అంటే చనిపోయే సమయంలో మూడు రెండవుతాయి. అంటే మరణం తరువాత రెండు జరుగుతాయి 'ఒకటి కాలుతుంది', 'రెండవది పైకి పోతుంది'. గమనిస్తే కాలేది 'దేహం'. పైకి పోయేది 'ఆత్మ' అని తెలుస్తుంది.

ఇక్కడ మరల మనం ప్రశ్నించుకోవాలి. కాలేది మనమా? పైకి పోయేది మనమా? అంటే ఖచ్చితంగా పైకి పోయేదే మనమని చెప్పవచ్చు. కారణం కాలే

దేహం మనమైతే ఇక మనం లేనట్టే.  కాని శ్రీ కృష్ణ భగవానుని సందేశం ప్రకారం మనకు ఇంకా జన్మలు వున్నాయి కాబట్టి; మనం ఇంకా వుంటాం కాబట్టి; వుండేది పైకి పోయే 'ఆత్మ' కాబట్టి...  'ఆత్మే' మనమని అర్థమవుతుంది. అంటే మనమంతా 'ఆత్మ'లమే కానీ దేహాలం కాదు అని స్పష్టంగా తెలుస్తుంది.

మరి 'ఆత్మ' మనమైనపుడు 'ఆత్మ' యొక్క శాశ్వత స్థానం ఏది? అంటే 'పరం'. దీనిని బట్టి **"మనమంతా ఇహలోక వాసులం కాదు, పరలోక వాసులమేనని స్పష్టంగా  అర్థమవుతుంది".**

ఇపుడు మనకు ఇంకొక ప్రశ్న ఉదయిస్తుంది. మనమంతా పరలోక వాసులమైనపుడు ఇహంలో అంటే ఈ భూలోకంలో ఎందుకు వున్నాం? మన శాశ్వత స్థానమైన పరం నుండి ఇహానికి ఎందుకు వచ్చాం? వచ్చి ఈ దేహం ఎందకు తీసుకున్నాం? ఈ దేహంతో ఏమి చెయ్యడానికి వచ్చాం? అసలు మరణించిన వారికి కర్మకాండలు చెయ్యడంలోని ఆంతర్యమేమిటి? అన్న విషయాలు తెలుసుకోవాలి. ఈ ప్రశ్నలకే కనుక మనం సమాధానం తెలుసుకోగలిగితే మనం భూమిమీద ఏం చెయ్యాలో తెలుస్తుంది.  ఎలా జీవించాలో తెలుస్తుంది.  అలా తెలుసుకుని జీవించే జీవితమే సరియైన జీవితం, సద్వినియోగం చేసుకున్న జీవితం అవుతుంది. కానీ అలా కాకుండా జీవించే జీవితం ఇహంలో ఎంత గొప్పదైనా అది వ్యర్థమే. ఒక రకంగా ఆలోచిస్తే ఆ జన్మనే వృధా చేసుకున్నట్టు. అందుచేత ఇవన్నీ ఆలోచించాలి.

మరి మనం పరం నుండి ఎందుకు వచ్చామో? ఇహంలో ఏం చెయ్యడానికి వచ్చామో? కొంచెం తెలుసుకుందాం. దీనికి ముందు మనం పరం గురించి కొంత తెలుసుకోవాలి.  ఇహంలో కోటానుకోట్ల, రకరకాల గృహాలు ఎలా వున్నాయో.. అలాగే పరంలో కూడా కోటానుకోట్ల రకరకాల లోకాలు వున్నాయి. అంటే భూమి మీద పాకలు, షెడ్లు, పెంకుటిళ్ళు, డాబాలు, మేడలు, భవంతులు, బంగళాలు, ప్యాలెస్‌లూ లాంటి రకరకాల గృహాలు అంటే సౌకర్యాలు లేనివి, అలాగే సౌకర్యాలు ఉన్న విలాసవంతమైన గృహాలు ఎలా వున్నాయో... అలాగే పరంలో  కూడా ఉన్నతమైన ఊర్ధ్వలోకాలు, వాటికి విరుద్ధమైన అధోలోకాలు కూడా వున్నాయి. సౌకర్యాలు ఉన్న వాటిని ఉన్నత లోకాలు అంటారు, తక్కువ వున్న వాటిని అధోలోకాలు  అంటారు.

ఈ కోటానుకోట్ల లోకాలను యోగులు 7 ఊర్ధ్వ లోకాలుగాను 7 అధోలోకాలుగాను విభజించారు. వాటినే చతుర్థశ భువనాలు లేక  పదునాలుగు భువన భాండాలు అంటారు. ఇవే మనకి పురాణాలలో కూడా చెప్పబడ్డాయి. అవి

1.భూలోకము, 2.భువర్లోకము, 3.సువర్లో కము, 4.జనాలోకము, 5.మహాలోకము, 6.తపోలోకము, 7.సత్య లోకము అనబడే ఊర్ధ్వలోకాలు. అలాగే 1.అతలము, 2.వితలము, 3.సుతలము, 4.రసాతలము, 5.మహాతలము, 6.తలాతలము, 7.పాతాళ లోకాలనే అధోలోకాలుగా యోగులు విభజించారు.

అంటే ఎవరైనా భూమిమీద వారి దేహంతో మోసాలు, నేరాలు, తప్పులు చేసినా... ఇతరులను కాని, జంతువులను కానీ హింసించినా మాంస భక్షణ చేస్తూ జీవుల హింసకు కారణమైనా, అంతేకాదు అలా పాపాలు చేస్తూ, అపవిత్రంగా, అధర్మంగా జీవించినా... చనిపోయిన తరువాత అధోలోకాలకు వెళతారు. అలా కాకుండా పవిత్రంగా, ధర్మంగా జీవిస్తూ... ఎవరినీ మోసగించకుండా, అహింస పాటిస్తూ... భూతదయ కలిగి వుండి, సాటి మానవులనే కాదు. అన్ని ప్రాణులను, అందరిని ప్రేమిస్తూ అందరికి మంచి జరిగేలా పుణ్యకార్యాలు, సత్కర్మలు చేసేవారు చనిపోయిన తరువాత ఊర్ధ్వలోకాలకు అంటే ఉన్నత లోకాలకు వెళతారు.

అలా పరలోకంలో భూమిమీద చేసుకున్న దాన్ని బట్టి ఏదో ఒక లోకంలో వుంటారు, అంటే భూమి మీద పుణ్యకార్యాలు, ధ్యాన, యోగ సాధనలు చేసిన వారు, చనిపోయిన తరువాత అంటే శరీరం వదిలిన తరువాత ఊర్ధ్వ లోకాలకు చేరుకుంటారు. అటువంటి వారికి అక్కడ వున్నటువంటి ఉన్నత లోకవాసుల సాంగత్యం కూడా కలుగుతుంది. వారి నుండి సృష్టిలోని ఉన్నతమైన జ్ఞానం పొందే అవకాశం కలుగుతుంది.

అలాగే పాపాలు చేసిన వారు అధోలోకాలకు చేరుకుం టారు. వారు అలాంటి వారి సాంగత్యమే పొందుతారు. అక్కడ మాత్రమే వారికి తాము భూమి మీద చేసిన పొరపాట్ల గురించి, పాపాల గురించి తెలుస్తుంది. ఏది ఏమైనా పుణ్యాలు చేసిన పుణ్యాత్మలు, గొప్ప గొప్ప కార్యాలు చేసిన మహాత్ములు విశేషమైన సాధనలు, తపస్సు, ధ్యాన సాధనలు చేసిన సాధకులు, ఋషులు, యోగులు ఊర్ధ్వ లోకాలలో వుంటారు. అలాగే పాపాలు, హింస, మోసాలు చేసిన వారు అధోలోకాలలో వుంటారు.

మనం పురాణాలు చూస్తే ఈ విషయమే తెలుస్తుంది. అందరికి ఉపకారం చేసే దేవతలు ఊర్ధ్వ లోకమైన స్వర్గ లోకంలో వుంటారని చెపుతారు. అలాగే అందరికీ అపకారం చేసే, హింస చేసే రాక్షసులు పాతాళ లోకంలో వుంటారని చెపుతారు. అంతేకాదు దేవతలు ఇష్టపడే ఆహారం శ్వాసాహారం అంటే ధ్యానం అని చెపుతారు. రాక్షసులు ఇష్టపడే ఆహారం రక్తమాంసాలు అని చెపుతారు.

ఏది ఏమైనా పరంలో ఎవరు ఏ లోకంలో వున్నా ఇంకా... ఇంకా... పై

లోకాలకు వెళ్ళాలనుకుంటారు. అంటే 'ఉన్న లోకం నుండి ఉన్నత లోకాలకు' చేరుకోవాలనే పరలోకంలో వున్నపుడు అనుకుంటారు. అంటే "ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి" పొందాలనే కోరుకుంటారు.

కానీ ప్రస్తుతం జనంలో వున్న నమ్మకమేమిటంటే మానవుడు తాను జీవించి వున్నప్పుడు ఎలా జీవించినా ఫరవాలేదు, ఏమి చేసినా ఫరవాలేదు, ఎలాంటి కర్మలు చేసినా ఫరవాలేదు, పాపాలు చేసినా ఫరవాలేదు, మరణించిన తరువాత మాత్రం కర్మకాండలు చేస్తే చాలు, ఉన్నత లోకాలకు చేరుకోవచ్చని భావిస్తారు.

అందుచేత జీవించి వున్నప్పుడు తాము చేసే కర్మలు గురించి అంటే పనుల గురించి ఆలోచించరు. చనిపోయినపుడు చేసే కర్మకాండలు గురించి మాత్రం చాలా శ్రద్ధ చూపిస్తారు.

కానీ జీవించి వున్నప్పుడు తాను చేసిన కర్మల ఫలితాలే తన కూడా వస్తాయి, తన తరువాత జీవితానికి వర్తిస్తాయి తప్ప చనిపోయిన తరువాత తన పేరు మీద ఎవరు ఏమి చేసినా అవి తనకు వర్తించవు, తన కూడా రావు అని తెలుసుకోలేక పోతున్నారు. అందుకే "చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ" అన్నారు.

ఇక్కడ కొంచెం ఆలోచిస్తే కర్మకాండ పేరుతో వేరొకరు చేసే కొద్దిపాటి దానాలే వారిని ఎన్నో ఉన్నత లోకాలను చేర్చగలిగినపుడు, మరి జీవించి వుండగా అలాంటి దానాలు, పుణ్యకర్మలు తానే స్వయంగా ఇంకా ఎక్కువ చేసుకుంటే ఇంకా ఎంతో గొప్ప స్థితి పొందవచ్చు కదా? మరి జీవించి వున్నప్పుడు ఎందుకు చెయ్యరు? తాను చేసే పనుల గురించి ఎందుకు ఆలోచించరు?

అందుచేత కర్మకాండల యొక్క ఆంతర్యం తెలుసుకుంటే అంటే మరణించిన తరువాత ఉన్నత లోకాలకు చేరుకోవాలనే భావం వున్నవారు తప్పనిసరిగా ఈ విషయాలన్నీ ఆలోచించాలి.

అందుచేత తెలుసుకోండి! పరంలో ఉన్నత లోకాలకు చేరుకోవాలంటే ఎవ్వరైనా సరే భూమిమీదకు రావాలి, మానవ దేహం తీసుకోవాలి, మానవ దేహంతో పుణ్యకార్యాలు చెయ్యాలి. ధ్యానసాధన చెయ్యాలి. అలాంటి ధ్యాన సాధనా శక్తితోనే ఎవరికైనా ఉన్నత లోకప్రాప్తి కలుగుతుంది తప్ప వేరే మార్గం లేదు. అందుకే ఋషులు, యోగులు ధ్యానం చేసేవారు ధ్యానానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు.

ఆఖరికి దేవతలైనా సరే ఇంకా, ఇంకా ఉన్నత లోకాలకు చేరుకోవాలంటే భూమిమీదకు రావలసిందే, వచ్చి మానవదేహం తీసుకుని, ధ్యాన సాధన చెయ్య వలసిందేనని అంటారు. ఎందుచేతనంటే ధ్యాన సాధన చెయ్యగలిగిన శక్తి ఒక్క మానవ దేహానికే వుంది తప్ప ఇక ఏ దేహానికి లేదు. అందుకే మానవ జన్మ అంత

గొప్పది అంటారు. అంతేకాదు మానవజన్మ లభించడమే దుర్లభం అని కూడా అంటారు.

అలా పరంలో వున్నవారు ఎవరైనా సరే ఏ లోకంలో వున్నవారైనా సరే, పరంలో శాశ్వతమైన అన్నిటి కంటే ఉన్నతమైన సత్య లోకానికి చేరుకోవాలని అనుకుంటారు. కారణం సత్యలోకానికి చేరేదాకా ఎవరైనా సరే, ఏ లోకంలో వున్నా సరే, మరల మరల భూలోకానికి రావలసి వస్తుంది. భూలోకంలో కష్టాలు, పాట్లు పడవలసి వస్తుంది. ఈ కష్టాల నుంచి, పాట్లు నుంచి శాశ్వతంగా బయట పడాలంటే అన్నిటి కంటే ఉన్నతమైన సత్యలోకం చేరుకోవాలి. అంతకు తప్ప వేరే మార్గం లేదు. కారణం మనం ఆరాధించే దేవుళ్ళంతా సత్యలోక వాసులే. అందుకే భూలోకంలో అందరూ దేవుళ్ళను చేరుకోవాలనుకుం టారు, దేవుని రాజ్యం చేరాలనుకుంటారు.

ఈ విషయమే శ్రీకృష్ణ భగవానుడు గీతలో కూడా చెప్పడం జరిగింది.



**శ్లో॥ ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తి నోర్జున!**
**మాముపేత్యతు కౌన్తేయ పునర్జన్మ నవిద్యతే॥** (భ.గీ. 8-16)

తా:- ఓ అర్జునా! ఆ బ్రహ్మలోకం వరకు గల లోకాలకు వెళ్ళినా మరల జన్మ ఎత్తవలసిఉంటుంది. కాని నన్ను చేరుకుంటే (అంటే నేను ఉండే సత్య లోకానికి చేరుకుం టే) మరల తిరిగి రావు. అంటే జన్మ వుండదు.


శ్రీ కృష్ణ భగవానుని ఈ సందేశం అర్థం కాక భూమి మీద మానవులు పుణ్య కర్మలు చేస్తుంటారు. కారణం పుణ్యం చేస్తే మోక్షం వస్తుందని భావిస్తారు. కానీ, పుణ్యం చేస్తే పుణ్యలోకాలకు చేరుకుంటారు. పుణ్యం క్షీణించగానే తిరిగి భూలోకానికి చేరుకుం టారు. అంతేకాని సత్యలోకానికి చేరుకోలేరు. భగవంతుని చేరలేరు. మోక్షం పొంద లేరు. భగవద్గీతలోని ఈ క్రింది శ్లోకం చూద్దాం.

**శ్లో॥ తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి!**
**ఏవం త్రయీ ధర్మ మను ప్రపన్నా గతాగతం కామకామా లభన్తే॥ (భ.గీ.9-21)**

తా:- వారు (అట్టి స్వర్గాభిలాషులు) విశాలమగు స్వర్గ లోకమునను భవించి పుణ్యం క్షీణించిన తరువాత తిరిగి మనుష్య లోకమున జన్మించుచున్నారు. ఈ ప్రకారముగా వేదోక్త కర్మమును (యజ్ఞ, యాగాది పుణ్యకర్మలు) అనుష్ఠించు భోగాభిలాషులు రాక, పోకడలను (జనన, మరణ ములను) పొందుచున్నారు.

దీనిని బట్టి మనం తెలుసుకోవల సింది ఎన్ని పుణ్య కార్యాలు చేసినా పుణ్య కార్యాలలో గొప్పవైన యజ్ఞ, యాగాలు చేసినా కూడా పుణ్య లోకాలకు

చేరుకోగలరు కానీ అంతకు మించిన లోకాలకు చేరుకోలేరు.



అందుకే పత్రీజీ **"పుణ్యం చేస్తే పుణ్య లోకా లకు చేరుకుంటారు. తపస్సు చేస్తే తపో లోకాలకు చేరుకుంటారు. ధ్యానం చేస్తే సత్యలోకానికి చేరుకుంటారు"** అని అంటారు.

అందుచేత ఏ మానవుడైనా సృష్టిలో అన్నిటి కంటే ఉన్నతమైన సత్యలోకానికి చేరుకోవడానికే ప్రయత్నించాలి. లేకపోతే మరల మరల భూమి మీదకు వస్తారు. మానవ జన్మ తీసుకుంటారు. దీనినే **"పునరపి జననం - పునరపి మరణం"** అంటారు.

అలా మరల, మరల భూమి మీదకు రావచ్చు కాని, భూమి మీదకు వచ్చిన వారు ఎన్నో పాట్లు పడాలి. ఎన్నో కష్టాలు ఎదుర్కోవాలి. ఎంతో నరకం అనుభవించాలి. ఆలోచిస్తే మానవ జీవితం అనుకున్నంత తేలిక కాదు. ఎందుచేతనంటే భూలోక జీవితంలో ఎన్ని భోగాలు వున్నా, భోగాలతో పాటు రోగాలు, కష్టాలు, దుఃఖం కూడా వుంటుంది. అందుకే ఋషులు, యోగులు భూలోక జీవితం నుండి శాశ్వతంగా బయట పడటానికి ప్రయత్నం చేసారు. ధ్యానసాధనకు ప్రాముఖ్యం ఇచ్చారు. మోక్షాన్ని పొందారు. లోకంలో గొప్పవారిగా కీర్తించబడ్డారు.

## యోగులంతా చెప్పిందీ ధ్యానమే - చేసిందీ ధ్యానమే



కానీ పరలోకం నుండి వచ్చిన మనం పరంలో వున్నపుడు, పరంలో ఉన్నత లోకాలకు చేరుకోవాలనే అనుకుంటాం. దానికోసం ధ్యానసాధన చెయ్యటానికి భూమి మీదకు వస్తాం. వచ్చి ఏదో ఒక దేహం తీసుకుంటాం. కాని దేహం తీసుకుని (జన్మించిన తరువాత) అంతా మరచి పోతాం. మనం భూలోకవాసులమనే అనుకుంటాం. భూలోకభోగాలు అనుభవించటానికి, భూలోకంలో గొప్పవారు కావటానికి ప్రయత్నిస్తాం.

అలా ఎవరిని చూసినా, ఎంతసేపూ ధనం, పదవులు, మంచి ఉద్యోగాలు సంపాదించి, ఇహంలో అంటే భూమి మీద ఎంతో ఉన్నతిని పొందటానికి అంటే గొప్పవారు కావటానికి ప్రయత్నిస్తారు - కాని పరంలో ఉన్నతి కోసం అంటే గొప్పవారు కావడానికి ప్రయత్నించరు. ఇహంలో సంపాదించటానికి కృషిచేస్తారు

– కాని పరంలో కావలసింది పొందటానికి కృషి చేయరు. ఇహలోక భోగాలే గొప్పవనుకుంటారు – కానీ పరలోక భోగాలు అంతకన్నా గొప్పవని తెలుసుకోలేరు. తాత్కాలికమైన వాటికి ప్రాముఖ్యం ఇస్తారు – కానీ శాశ్వతమైన వాటి గురించి మరచిపోతారు. ఇహలోక ధనానికి ప్రాముఖ్యం ఇస్తారు – కాని పరలోక జ్ఞానానికి ప్రాముఖ్యం ఇవ్వరు. **"ఎంతసేపూ ఇహలోక వాసులమనే అనుకుంటారు – కాని తాము పరలోక వాసులమన్న సంగతే మరచిపోతారు"**. ఇహం గురించే ఆలోచిస్తారు – కానీ పరం గురించి ఆలోచించరు.

అలా ఇహంలో బాషాభిమానం, కులాభిమానం, ప్రాంతాభిమానం, మతాభిమానం, దేశాభిమానం ప్రదర్శిస్తూ అసలైన ఆత్మాభిమానాన్ని మర్చిపోతారు. నా ధనం, నా ఇల్లు, నా పొలం, నా ఫ్యాక్టరీ, నా సంపదలు అని కలవరిస్తారే కానీ నా 'ఆత్మ' అని ఒక్కసారి కూడా తలవరు.

అంతేకాదు నా భార్య, నా భర్త, నా పిల్లలు, నా బంధువులు, నా స్నేహితులు అంటూ 'ఆత్మ'ను మర్చిపోతారు. అందరి గురించి ఎన్నో చేస్తారు, ఎంతో కష్ట పడతారు. కానీ ఆత్మ గురించి అంటే తన గురించి ఏమీ చెయ్యరు. అలా జీవిస్తూ తాము ఎంత నష్టపోతున్నామో తెలుసుకోలేకపోతున్నారు. అందుకే "తన్ను మాలిన ధర్మం లేదంటారు". అందుకే గౌతమ బుద్ధుడు "అన్యోద్ధరణ కాదు ఆత్మోద్ధరణ గావించుకోండి" అంటారు.

రామకృష్ణ మిషన్ వారు ఈ విధంగా చెపుతారు.

"ఆత్మనోమోక్షాయచ, జగత్ హితాయచ" అంటే మొదట ఆత్మకు మోక్షం, తరువాత జగత్ హితం అని. అలా ఎవరిని చూసినా ఆత్మను ఉద్ధరించుకోమనే చెప్పారు. అంటే తనను తాను ఉద్ధరించుకోమని చెప్పారు.


కానీ లోకంలో ఆత్మ గురించి ఆలోచించకుండా దేహానికే ప్రాముఖ్యం ఇస్తూ జీవితమంతా గడిపేస్తున్నారు. జీవితంలో ఎన్నో సంపాదిస్తారు. సమకూర్చుకుం టారు. చివరకు ఎప్పుడో ఒకప్పుడు అన్నిటిని వదలి ఇహం నుంచి నిష్క్రమిస్తారు. అంటే శరీరాన్ని వదిలేస్తారు, అంటే చనిపోతారు. మరల పరానికి వెళతారు. అపుడు తెలుస్తుంది నేను పరలోకవాసినే కాని భూలోక వాసిని కాదని, భూ లోకంలో వుండేవాడిని కానని, భూలోకం అన్నది తాత్కాలిక స్థానమని అర్ధమవుతుంది. కాని అప్పటికే అంతా అయిపోతుంది. ఇక చేయగలిగింది ఏమీ వుండదు. అపుడు ఎంత మంచి అవకాశం వ్యర్థం చేసుకున్నానని ఎంత బాధపడినా ప్రయోజనం ఉండదు. ఇవ్వబడిన అవకాశం చేజారిపోతుంది. అపుడు మరల ఇంకో అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటారు. మరల కొత్త దేహం కోసం ప్రయత్నిస్తారు.

ఇలా జరుగుతుంది. మానవ జన్మ నిష్ప్రమణ. అంతేకాదు ఇహంలో ఎంత సంపాదించినా, ఏమి సాధించినా అది పూర్తిగా వ్యర్ధమవుతుంది. అది ఎంత మాత్రం పరానికి అంటే తనకు అంటే ఆత్మకు ఉపయోగపడదు... ఏదీ కూడా రాదు. అందుకే **"చనిపోయినపుడు ధనం పెట్టెలో ఉండిపోతుంది. భార్య గడప దాకా వస్తుంది. బంధువులు, మిత్రులు, శ్మశానం వరకే వస్తారు. కాని చేసుకున్న సాధనా ఫలితమే కూడా వస్తుంది"** అని అంటారు.


అందుచేత ఇహంలో జీవించేటపుడే నేను ఇహలోకవాసినా? పరలోక వాసినా? అనే విషయం నిర్ధారణ చేసుకోవాలి. ఆలోచిస్తే ఖచ్చితంగా అందరూ పరలోక వాసులే అని తెలుస్తుంది. కారణం అందరూ ఆత్మలే గనుక. మరి మనం పరలోకవాసులమైనపుడు, మనం ఇహంలో ఏమి చెయ్యాలి? ఏమి చేస్తే పరంలో లాభం పొందుతాం? అన్నది ఆలోచించాలి. ముఖ్యంగా ధ్యానసాధన చెయ్యాలి. 'ధ్యానం' ఒక్కటే ఆత్మకు, అంటే మనకు లాభించేది, ఉన్నతలోక ప్రాప్తి కలిగించేది. ధ్యాన సాధనే కాదు. ధ్యానభోధ కూడా పరానికి లాభమే. ధ్యానానికి సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనడం, వాటికి సహకరించటం, ఆత్మకు సంబంధించిన పుస్త కాలు చదవడం, అలాంటి వారితో సాంగత్యం చెయ్యడం, ఇవన్నీ కూడా పరలోకంలో వున్నతికి లాభకరమే. అందుచేత ధ్యానం గొప్పతనం తెలుసుకోండి. ప్రతీరోజు ధ్యానం చెయ్యండి. ముఖ్యంగా ప్రతీరోజు ఈ విషయం గురించి ఆలోచించాలి.

**"ఈ రోజు నేను నా ఆత్మ కోసం ఏమి చేశాను?"**

తప్పని సరిగా ప్రతి ఒక్కరూ ఈ ప్రశ్న వేసుకోవాలి. కారణం ఆత్మకు



కాకుండా మీరు రోజంతా ఏమి చేసినా? ఏమి సంపాదించినా? ఏమి సాధించినా? ఎంతకష్టపడినా? అంతా వ్యర్థం. అందుచేత తప్పనిసరిగా "మీ గురించి అంటే ఆత్మ గురించి ఏమి చేసాను?" అని ఆలోచించాలి.



యాజ్ఞవల్క మహర్షి "ఈశావాశ్యోపనిషత్"లో ఈ విధంగా చెప్పడం జరిగింది.

**"ఎవరైతే ఆత్మ హంతకులో అంటే తన స్వరూపమైన ఆత్మ తత్వ సాక్షాత్కారాన్ని నిర్లక్ష్యం చేస్తారో! వారు మరణానంతరం అజ్ఞానాంధకారం చేత ఆవరింపబడిన రాక్షసీయ జన్మలను పొందుతారు".**

అందుచేత తెలివైన వారు ఎవరంటే... **"ఆత్మ కోసం అంటే తన కోసం దేహాన్ని ఉపయోగించుకునేవారు. అంతేకాని దేహం కోసం ఆత్మను బలి చేసేవారు కాదు".** అందుకే యోగులంతా ఆత్మ కోసం దేహంచేత విపరీతమైన ధ్యాన సాధన చేయించారు. అందుకే "పరోపకారార్థం ఇదం శరీరం" అన్నారు. అంటే (పర + ఉపకారం = పరోపకారం). పరలోక ఉపకారార్థమే ఈ శరీరం అని అర్థం.

అందుచేత తెలుసుకోండి **"ఆత్మ తన కోసం దేహాన్ని తీసుకుంది కానీ దేహం ఆత్మను తెచ్చుకోలేదు".** ఇది తెలుసుకుంటే ప్రతి ఒక్కరూ దేహంతో ధ్యానం చేస్తారు.

అంతేకాదు ధ్యానం చేస్తే పరానికే కాదు. ఇహంలో కూడా లాభమేనని తెలుసుకోవాలి. పరలోకం ఎలా కనబడదో ధ్యానసాధనా ఫలితం కూడా కంటికి కనబడదు. చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఒక దేశానికి అధ్యక్షుడనుకుందాం అంటే ఆ దేశంలో అందరికంటే గొప్పవాడే కదా? లేక గొప్ప ధనువంతుడనుకుందాం. భూమి మీద చాలా సంపాదించుకున్నాడనుకుందాం. భూములు, భవంతులు, ప్యాలెస్‌లు లాంటివి ఎన్నో సంపాదించుకున్నాడు. కానీ అతను ఇహంలో వుండి కూడా పరం గురించి ఆలోచించలేదు, ఏమీ చెయ్యలేదు. ఆఖరుకు ధ్యానం కూడా చెయ్యలేదు. అలాంటి వారు చనిపోతే ఏదో సామాన్యమైన లోకానికి వెళతారు.

అదే ఒక రిక్షావాడు కాని, ఆటో డ్రయివరు కాని, సామాన్య గుమస్తా కాని రోజూ ఒక గంట ధ్యానం చేసాడనుకుందాం. ఇతడు చనిపోయిన తరువాత భూలోకంలో గొప్పవారుగా భావించబడే ధనవంతులు కంటే, పదవులున్న వారి కంటే కూడా పరంలో ఎన్నో లక్షల లోకాలు పైన వుంటాడు. అంటే ఇహంలో గొప్పవాడైనా ధ్యానం చెయ్యని కారణంగా పరంలో తక్కువవాడు అయ్యాడు. కాని

ఇహంలో సామాన్యుడైనా ధ్యాన సాధన చేసిన కారణంగా పరంలో గొప్పవాడయ్యాడు. అంటే **"తాత్కాలికంలో గొప్పవాడు శాశ్వతంలో తక్కువ వాడయ్యాడు". కాని "తాత్కాలికంలో తక్కువవాడు శాశ్వతంలో గొప్పవాడయ్యాడు".** అందుకే శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుని ధ్యాన యోగివికా! అని చెప్పడం జరిగింది. ధ్యానం చేసే యోగి సాధనా లక్ష్యాన్ని సాధించకపోయినా... మధ్య లో మరణించినా... అంటే శరీరాన్ని వదిలిపెట్టవలసి వచ్చినా... ఎంతో లాభం పొందుతాడని ఈ క్రింది శ్లోకాలు ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శ్వాతీ స్సమాః।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టో భిజాయతే॥** (భ.గీ.6-41)

తా:- అట్టి యోగభ్రష్టుడు (మరణానం తరము) పుణ్యాత్ముల లోకమును పొంది, అచట అనేక సంవత్సరములు నివసించి, తదుపరి సదాచార వంతులైన శ్రీమంతుని యొక్క గృహమందు పుట్టుచున్నాడు.

**శ్లో॥ అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్** (భ.గీ.6-42)



తా:-లేక జ్ఞానవంతులగు యోగుల యొక్క వంశమందు జన్మించు చున్నాడు. అలాంటి జన్మ లభించడం లోకంలో మహా దుర్లభము.

ఇక్కడ మనం కొంచెం ఆలోచిం చాలి. ధ్యానం చేసేవారికి సామా న్యంగా ఏ లాభాలు పైకి కనిపించవు. వారికి ధన సంపాదన ఎక్కువ వుండదు. అంతేకాదు సాధారణంగా ధనం తక్కువ వున్నవారే ధ్యానం చేస్తూ వుంటారు. వారిని చూసి మిగతా వారు ఏమిటి? వీళ్ళు ఏమీ చేయ కుండా... ఏమీ సంపాదించకుండా... ఏమీ అనుభవించకుండా.. అలా ఎప్పుడూ ధ్యానం చేస్తూ కూర్చుం టారు, తెలివి తక్కువ వారిలా వున్నారే! అని ధ్యానం చేసే వారిని చూసి చాలా మంది అనుకుంటూ వుంటారు, అనే వారు కూడావున్నారు.

కానీ అలా ధ్యానం చేసే వారు ఎంత గొప్పవారో! వారు పరంలో ఎంతటి గొప్ప లోకాలకు చేరుకుంటారో! మరలా వారికి ఎంత ఉన్నతమైన జన్మ లభిస్తుందో! పై శ్లోకాల ద్వారా భగవానుడు తెలియచేయడం జరిగింది. ఆయన చెప్పిన ప్రకారం మరుజన్మలో అప్రయత్నంగానే శ్రీమంతుల ఇళ్ళలో జన్మిస్తారని, గొప్ప జ్ఞానవంతులగు యోగుల ఇళ్ళలో జన్మిస్తారని, అలాంటి జన్మ లభించడం మహా దుర్లభమని ఆయన చెప్పడం జరిగింది. అందుకే ఆయన అందరికంటే 'యోగి' గొప్పవాడని చెప్పడం

జరిగింది. ఆఖరుకు యజ్ఞ, యాగాది కర్మలు చేసే వారి కంటే 'యోగి' గొప్పవాడని చెప్పడానికి కారణం ఇదే. అందుకే అర్జునుని యోగి అవ్వమనే శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది. ఈ క్రింది శ్లోకం చూద్దాం.

శ్లో॥ **తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోధికః**
**కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున ॥** (భ.గీ.6-46)

తా:- ఓ అర్జునా! యోగి అనువాడు తపస్సులు చేసే వారి కంటే, శాస్త్ర జ్ఞానము కలవారి కంటే, అగ్నిహోత్రాది కర్మలు చేసేవారి కంటే శ్రేష్టుడు. కావున నీవు యోగివి కమ్ము.

దీనిని బట్టి 'ధ్యానం' చేసే 'యోగి' ఎంత గొప్పవాడో! ఎంత అదృష్ట వంతుడో! అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ధ్యానం చేసే వారు సామాన్యంగా కనిపించ వచ్చు, లోకం దృష్టిలో సామాన్యులు కావచ్చు. కానీ అందరికంటే వారే గొప్పవారని భగవానుడు చెప్పిన దానిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం లోకంలో కొంతమంది ధనవంతులుగా వుండవచ్చు. కానీ ఆ ధనం చనిపోయిన తరువాత పరానికి కానీ, మరుజన్మకు కానీ తీసుకు వెళ్ళలేరు. అంతేకాదు వారి మరుజన్మ ఎలా వుంటుందో కూడా తెలియదు. కాని ధ్యానం చేసిన వారు పరంలో పుణ్య లోకాలు పొందడమే కాదు, మరు జన్మలో శ్రీమంతులుగా కాని, గొప్ప యోగులుగా కాని జన్మిస్తారని, అంతేకాదు అలాంటి జన్మ పొంది వారు తదనంతర సాధన పూర్తి చేసుకుని మోక్షాన్ని కూడా పొందుతారని, జీవిత లక్ష్యాన్ని సాధిస్తారని భగవానుడు చెప్పడం జరిగింది. ఈ క్రింది శ్లోకం చూద్దాం.

శ్లో॥ **ప్రయత్నా ద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।**
**అనేకజన్మ సంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్ ॥**(భ.గీ.6-45)

తా:-అలా ప్రయత్నించునట్టి యోగి పాపరహితుడై, అనేక జన్మములందు చేయబడిన అభ్యాసముచే యోగ సిద్ధిని పొంది ఆ పిదప సర్వోత్తమమగు మోక్షమును పొందుచున్నాడు.

అందుచేత గుర్తుంచుకోండి మనకు తాత్కాలికమైన ఈ ఇహలోక జీవితం ఎందుకు? అంటే దేహం ధరించింది ఎందుకు? అంటే మన (ఆత్మ) శాశ్వత పరలోక జీవితం కోసం మాత్రమే. ఇది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అందుచేత ఇక్కడ ఏమి వున్నా లేకపోయినా దానికోసం ఆలోచించవద్దు, అంటే బాధపడవద్దు. ఇతరులకు వున్నాయని అసూయ చెందవద్దు. అవి సంపాదించడం కోసం తప్పులు, పాపాలు చేయవద్దు. ఇవన్నీ చేస్తూ అనవసరంగా జీవితాన్ని కష్టాల పాలు చేసుకోవద్దు. ధ్యానసాధన చెయ్యగలుగుతున్నామా? లేదా? అని ఆలోచించండి. ధ్యానం చెయ్య గలిగిన వారే గొప్పవారని తెలుసుకోండి **"ధనం కాదు - ధ్యానమే గొప్పది", "ధనం వెంట రాదు - ధ్యానం వెంట వస్తుంది".** అందుచేత "ధనం వెంట కాదు.

ధ్యానం వెంటపడండి”. మనమంతా పరలోక వాసులమని తెలుసుకోండి.

అంతేకాదు ఆత్మలమైన మనం, పరలోక వాసులమైన మనం పరలోక లాభాలకు, పరలోక వున్నతి పొందటానికి ఇహలోకానికి వచ్చామని, ఈ జీవితాన్ని తీసుకున్నామని తెలుసుకోవాలి. దేహ అవసరాలు చూసుకుంటూ ఉన్న కాళీ సమయం వృధా చేయకుండా ధ్యాన సాధనకు, ఆత్మ లాభానికి అంటే ఆత్మ ఉన్నతికి కావలసిన పనులు చెయ్యటానికి ఉపయోగించాలి. ముఖ్యంగా విశేషంగా ధ్యానం చెయ్యాలి, ఆత్మ జ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవాలి, ఆత్మ జ్ఞానుల సాంగత్యం చేయాలి. అటువంటి శిబిరాలలో పాల్గొనాలి. ఇవన్నీ ఆత్మకు లాభమే.

అలా జీవించగలిగే జీవితమే సరియైన, సవ్యమైన జీవితం. అలా జీవించిన జీవితమే అసలైన ‘ఆధ్యాత్మిక జీవితం’ అవుతుంది. అలా జీవించకపోతే ఆ జీవితమే వ్యర్థమైపోతుంది. అందుచేత ముఖ్యంగా జీవితాన్ని చాలా పొదుపుగా వాడాలి. పరంలో అనుకున్నది సాధించాలి. జీవితాన్ని ఎందుకు పొదుపుగా వాడాలో తెలుసుకోవటానికి ఈ క్రింది ఉదాహరణ చూద్దాం.

## జీవితాన్ని పొదుపుగా వాడాలి!

ఇద్దరు వ్యక్తులు పొరుగు గ్రామంలో ఉన్న బంధువు ఇంటికి వెళ్ళారు. కాని వారు వెళ్ళే ముందే ఆ గ్రామంలో బాగా వర్షం పడటం వల్ల రోడ్లన్నీ బురదగా వుండటం చేత వీరిద్దరి కాళ్ళు బురదయ్యాయి. ఆ బంధువు కాళ్ళు కడుక్కోవటానికి చెంబుతో నీళ్ళు ఇచ్చాడు.

మొదటి వ్యక్తి చెంబులోని నీరు కొద్దిగా కాళ్ళమీద పోసుకుని, కాళ్ళు రుద్దుకుని మరి కొంత నీరు పోసి శుభ్రం చేసుకున్నాడు. ఇంకొంత నీటితో చేతులు కడుక్కుని, కొద్దిగా నీరు నోటిలో వేసి పుక్కిలించి నోరు శుభ్రం చేసుకున్నాడు. మిగిలిన నీటితో మొహం కడుక్కున్నాడు. అలా యజమాని ఇచ్చిన చెంబు నీటిని పొదుపుగా వాడి అన్నీ శుభ్రం చేసుకున్నాడు.

కాని రెండవ వ్యక్తి చెంబుతో నీరు ఇవ్వగానే, చెంబుడు నీళ్ళు కాళ్ళ మీద దిమ్మరించాడు. కాని మురికిపోలేదు. మళ్ళీ యజమాని ఇంకో చెంబు నీళ్ళు ఇచ్చాడు అది కూడా దిమ్మరించాడు. అయినా బురద పోలేదు. అలా బకెట్‌లో నీళ్ళన్నీ అయిపోయాయి కానీ అతని కాళ్ళ బురద పూర్తిగా వదలలేదు. అతను ఇంకా చేతులు కాని, నోరుకాని, ఆఖరికి ముఖం కాని శుభ్రం చేసుకోలేదు. ఆ యజమాని లోలోపల ఇన్ని నీళ్ళు ఇచ్చినా ఇంకా నీళ్ళు తెమ్మంటున్నాడు అని విసుక్కున్నాడు.

ఆ యిద్దరి వ్యక్తులు లాగే మన జీవితాలు కూడా వున్నాయి. కొంతమంది తమ జీవితాన్ని పొదుపుగా వాడి సద్వినియోగం చేసుకుంటు న్నారు. వారు రోజులో

కొంత సమయం భుక్తికి కావలసిన సంపాదనకు కొంత సమయం సంసారానికి, కొంత సమయం లోకం కోసం, ఇంకా కొంత సమయం జీవిత లక్ష్యాన్ని సాధించే నిమిత్తం, యోగుల పుస్తకాలు చదవడానికి, సజ్జన సాంగత్యం చేయడానికి, ధ్యాన సాధనకు ఉపయోగిస్తున్నారు. మోక్షాన్ని పొందుతున్నారు. సంసారంలోనే నిర్వాణాన్ని పొందుతున్నారు.

కానీ ఎక్కువ మంది రెండవ వ్యక్తిలా జీవితాన్ని వ్యర్థం చేసుకుం టున్నారు. వారు దేహాభిమానంతో సంపాదన, సంసారం, అంటూ తమ కులం, మతం, ప్రాంతం, దేశం అంటూ... కనిపించేవన్నీ శాశ్వతమను కుని తాను భూలోక వాసినని పదవులు, పేరు, ప్రఖ్యాతులంటూ గొప్పవా డినవ్వాలని, గొప్పల కోసం జీవిస్తూ జీవిత లక్ష్యాన్ని మరచి జన్మను వృథా చేసుకుంటున్నారు. ధ్యాన సాధన చేయరు. కర్మలు పెంచుకుని జీవితాన్ని దుఃఖమయం చేసుకుంటున్నారు. జీవితాన్ని వ్యర్థం చేసుకుంటు న్నారు. చివరకు దుఃఖం తోటే జీవితాన్ని చాలిస్తున్నారు. ఇలా ఎన్ని జన్మలు పొందినా వారి పరిస్థితి ఇంతే. " పునరపి జననం – పునరపి మరణం".

ఆలోచిస్తే అసలు మానవ జన్మ పొందటమే దుర్లభం. అలాంటి మానవ జన్మలో సగం నిద్రకే సరిపోతుంది. ఉన్నదాంట్లో కొంత బాల్యానికి, కొంత వృద్ధాప్యానికి తీసివేస్తే ఉన్న దాంట్లో కొంత భుక్తికి, అంటే సంపాదనకు కొంత సంసార బాధ్యతలు నిర్వహించడానికి తీసేస్తే ఉండే జీవితమే స్వల్పం. ఆ కాస్త జీవితాన్ని టివిల దగ్గర, పనికి రాని పుస్తకాలు, పేపర్లు చదువుతూ, పనికి రాని కబుర్లు చెప్పుకుంటూ ఇతరుల గొడవలలో జోక్యం చేసుకుంటూ, వ్యసనాలలో మునిగిపోయి, జీవితాన్ని, కాలాన్ని, శక్తిని పూర్తిగా వృథా చేసుకుంటున్నారు.


కాని వృథాగా గడిపే కాలాన్ని, 'ఆత్మ'కు అంటే తమ గురించి అంటే తమ జీవిత లక్ష్యం సాధించటానికి కావలసిన ధ్యాన సాధనకు, స్వాధ్యాయానికి, సజ్జన సాంగత్యానికి ఉపయోగిస్తే మొదటి వ్యక్తిలా జీవితాన్ని సద్వినియోగం చేసుకున్న వారవుతారు. లేకపోతే ఎన్ని చెంబులు నీళ్ళు ఇచ్చినా కాలి బురద పోనట్లే ఎన్ని జన్మలెత్తినా కర్మలు పోవు, కష్టాలు పోవు. అటువంటి వారికి "చావు పుట్టుకలు లేని జీవితం కాకుండా చచ్చి పుట్టే జీవితమే గతి అవుతుంది".

అందుచేత ధనం విషయంలో ఎలా పొదుపు పాటిస్తున్నామో జీవితాన్ని కూడా అలా పొదుపుగా వాడుకోవాలి. అంటే బాధ్యతలు నిర్వర్తించుకుంటూ, మిగిలిన సమయాన్ని జీవిత లక్ష్యాన్ని అంటే ఆత్మ ఉన్నతికి అంటే పరలోక ఉన్నతి కోసం కృషి చెయ్యాలి, యోగుల మార్గంలో నడవాలి, యోగులు చెప్పినట్టు అనుసరించాలి. మరొక్కసారి తెలుసుకోండి

**"మనం పరలోక వాసులమే కాని ఇహలోక వాసులం కాదు".**

**"మనం చెయ్యవలసింది ధ్యానం – పొందవలసింది జ్ఞానం"**

# అనుబంధం
## (బ్రహ్మర్షి పత్రీ గారి తులసీదళం -1 నుండి)



## తనువు - ఆత్మ
### యోగి వేమన

**"కట్టె యందు నిప్పుగానని చందమే**
**తనువు నందు ఆత్మ తగిలి యుండు**
**మఱుగు దెలిసి పిదప మార్కొనవలెనయా**
**విశ్వదాభిరామ వినుర వేమ"**

తా:- "రెండు కట్టెల ఒరిపిడి వలన నిప్పు రాలుతుంది. కట్టెల నిప్పు కనిపించకుండా ఉన్నట్లే దేహంలో ఆత్మ వుంటుంది. ఈ రహస్యం తెలుసుకుని ఆత్మతత్త్వంలో మెలగాలి"..

**పత్రీజీ వివరణ :** కట్టెలు నరికితే 'నిప్పు' అన్నది కనబడుతుందా? విత్తనాన్ని విరగగొడితే 'చెట్టు' అన్నది బయటపడుతుందా? అట్లాగే శరీరాన్ని నరికితే 'ఆత్మ' అన్నది కనబడదు చర్మచక్షువులకు కనబడనంత మాత్రాన ఆత్మ అన్నది దేహంలో వ్యాపించి లేదని కాదు "నా కంటికి చూపించు" అని సవాలు చేసేవారు మూర్ఖులు కంటికి కనిపిస్తుంది .. అయితే "మూడో కంటి" కి

## యోగి

**"ఎచట నుంచి వచ్చు నెచటికి దాబోవు?**
**నిద్ర చంద మెరుగ నేర్చునేని**
**ఆత్మరాకపోకలతడె పో శివయోగి**
**విశ్వదాభిరామ వినుర వేమ"**

తా:- " మనం ఏ లోకాల నుంచి వచ్చాం ? " " చనిపోయిన తర్వాత ఏ లోకాలకు వెళ్తాం ? " " అసలు నిద్ర అంటే ఏమిటి ? " " ఆత్మ రాకపోకలు ఎలా జరుగుతాయి? " ... ఇలాంటి వాటన్నింటి గురించీ సక్రమ ధ్యానాభ్యాసం లో తెలుసుకోవలసిన వాటినన్నింటినీ తెలుసుకున్నవాడే " యోగి "

**పత్రీజీ వివరణ :** " ఆత్మ " అంటే " దేహం " కన్నా భిన్నంగా వున్న " దేహి " అంటే " బల్బు "లో ప్రసరిస్తున్న " కరెంట్ " లాంటిది. " ఆత్మ "ను గురించి తెలియజేసేదే " యోగవిద్య " అంటే "ధ్యాన విద్య". **" యోగవిద్య "** నెరిగిన వాడే **" శివయోగి "**



## వశిష్ఠ గీతలో అదృష్టం

**" యథా సంయతతే యేన తథా తేనానుభూయతే ।**
**స్వకర్మైవేతి చాసేత న్యా వృత్తిరిక్తా న దైవదృక్ ॥"**
**(వశిష్ఠ గీత 2-17)**

తా:- "ఎవడు ఎలా ప్రయత్నిస్తాడో దాని ఫలాన్ని అతడు అలాగే అనుభవిస్తాడు. పూర్వ జన్మలలోని స్వీయ కర్మలే ఫలావస్థ పొందినప్పుడు 'దైవం' అనీ, 'అదృష్టం' అనీ చెప్పబడుతోంది. ఆ విధంగా తన కర్మల కంటే వేరైన 'దైవం' కానీ, 'అదృష్టం' కానీ, ఏమీ లేదు".

**"దోష శామ్యత్యసందేహం ప్రాక్తనోద్యతనైర్గుణైః**
**దృష్టాన్తోత్ర హ్యస్తనస్య దోషస్యాద్య గుణై క్షయః (వశిష్ఠ గీత 2-18)**

తా:- ఈ జన్మలోని 'శుభ ప్రయత్నం' ద్వారా పూర్వ జన్మపు అశుభ పురుష ప్రయత్నాలు అన్నీ నిస్సందేహంగా శమించి పోతాయి. 'గత దినంలోని అజీర్ణాది దోషాలు ఈవాల్టి ఔషధాది గుణాల ద్వారా నయమవటమే' ఇక్కడి దృష్టాంతం"

---

## అయం లోకో నాస్తి పరః

**"న సాంపరాయః ప్రతిభాతి బాలం**
**ప్రమాద్యంతం విత్తమోహేన మూఢమ్**
**అయం లోకో నాస్తి పర ఇతిమానీ**
**పునః పునర్వశమాపద్యతే మే "**
**(కఠోపనిషత్తు 2-6)**



తా:- "జాగ్రత్తలేని వారికి, బాలుడికీ (జ్ఞానం లేని వారికి) ధన మదంతో సమ్మోహితులైన వారికి ఎన్నటికీ ఉత్తమగతులు కన్పించవు.

'ఉన్నది ఈ లోకమే, మరో లోకం లేనే లేదు' - అనుకునేవాడు మళ్ళీ మళ్ళీ నా (మృత్యువు) చేతిలో పడుతూ వుంటాడు" అని యముడు నచికేతునితో కఠోపనిషత్‌లో అంటాడు.



# పునర్జన్మ

## " నిరుక్తం "

అన్నది ఒకానొక ముఖ్యమైన వేదాంగం అది పునర్జన్మ గురించి ఇలా చెప్తోంది:

**"మృతత్చాహం పునర్జాతో జాతశ్చాహం పునర్ మృతః ।**
**నానా యోని సహస్రాణి మయోషితాని యానివై ॥ "**

తా:– "జ్ఞాని అయిన వాడు – 'నేను చాలా సార్లు పుట్టాను, మరణించాను; ఎన్నో యోనులలో నివసించాను' అని తెలుసుకుంటాడు"

**"నిరుక్తం"** ఇంకా ఇలా చెప్తోంది :

**"ఆహారా వివిధా భుక్తా పీతా నానావిధా స్తనాః;**
**మాతరో వివిధ దృష్టా పితరః సుహృదస్తథా "**

తా:– జ్ఞాని అయిన వాడు – "అనేకానేక యోనులలో ఎన్నో రకాల ఆహారాలు తిన్నాను. ఎంతో మంది తల్లుల పాలు త్రాగాను. ఎంతో మంది తండ్రులను, సహృదయులను చూశాను " అని అర్థం చేసుకుంటాడు.

**(దయానంద – గోపదేవ్ ఆధారంగా)**


---

# ఆత్మా దృశ్యతే సూక్ష్మదర్శిభిః

**"ఏష సర్వేషు భూతేషు గూఢోత్మాన ప్రకాశతే ।**
**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః ॥ "**

**(కఠోపనిషత్ 3–12)**

తా:– "అన్ని జీవులలోనూ గుప్తమై వున్న ఈ ఆత్మ అందరికీ ప్రకటితం కాదు; సూక్ష్మ దర్శులైన ఋషులు మాత్రమే తీక్షణమైన, ఏకాగ్రమైన తమ బుద్ధి ద్వారా ఈ ఆత్మను సాక్షాత్కరించుకోగలరు".



# "ఓం తత్ సత్ -2"

**"అందరూ మన వాళ్ళే .. అంతా మన మంచికే" ..**

ఈ విధంగా ప్రతి రోజు జీవించగలగడమే

**"ఆధ్యాత్మికత ॥"**

జీవితంలో జరిగే ప్రతి సంఘటననూ స్వీయ ఆత్మశక్తిని మరింత ప్రబలం చేసుకునే విధంగా మలచుకునే విధంగా నిరంతర ప్రయత్నమే

**"ఆధ్యాత్మికత"**

జీవితంలో జరిగే ప్రతి సంఘటన కూడా మనలను మనం మరింత చక్కగా చూసుకోవడానికి దోహదపడుతుంది.

మనల్ని మనం మరింత చక్కగా చూసుకోవాలన్నా...

మనల్ని ఇతరులు మరింత చక్కగా మరి చూడగలగాలన్నా ... జీవితంలో రకరకాల సంఘటనలు జరుగుతూనే వుండాలి.

ప్రపంచం ఎప్పుడూ భిన్న భిన్న మనస్తత్వాలు కలిగిన ప్రజలతో వుంటుంది...

భిన్న భిన్న మస్తత్వాలు గల మానవుల ద్వారా రకరకాల సంఘటనలు నిరంతరంగా జరుగుతూనే వుంటాయి.

అయితే మూల ఆత్మ – ప్రకృతిలో ఘర్షణలు / సంఘర్షణలు లేవు!

కేవలం "నేను శరీరాన్ని" అనుకుంటూన్న మానవుల మనస్సులలోనే **"ఘర్షణలు"** తద్వారా మానవుల సమాజంలో **"సంఘర్షణలు"** .. వుంటాయి.

అన్ని మతాలూ **"నువ్వు మానవునివి కావు .. దేవుడి ప్రతిరూపం"** అని ప్రబోధిస్తున్నాయి : దానిని **"స్వానుభవం"** ద్వారా అర్థం చేసుకోవడం అన్నదే **"ఆధ్యాత్మికత"**

మానవుని మనస్సు / మెదడులో **"ఘర్షణలు".**

మానవుల సమిష్టి సమాజంలో **"సంఘర్షణలు".**

శరీర దృక్పథంతో చూస్తే **"మానవుడు".** ఆత్మ దృక్పథంతో చూస్తే **"మాధవుడు"**

మానవుల సామూహిక సాధారణ బహిరేంద్రియ చైతన్యం ద్వారా **"మనస్సు"** ఉద్భవిస్తుంది.

**"మనస్సు" ద్వారా "మానవుడు"**

సృష్టి యొక్క మూల ఆత్మ చైతన్య భాగంగా వున్న జీతవాత్మ యొక్క ఆత్మేంద్రియ సాధన ఆధారంగా "మేధస్సు" ఉద్భవిస్తుంది.

**"మేథస్సు" ద్వారా "మాథవుడు"**

**"మానవుల"** మనస్సు / మెదడులలో **"ఘర్షణలు వుండడం"** అన్నది సహజం...
**"మాధవుల"** మేధస్సు / మెదడులలో **"ఘర్షణలు లేకపోవడం"** అన్నది సహజం.
ధ్యానానికి పూర్వం శరీరదృక్పథంలో వుంటాం
ధ్యానం అభ్యాసం చేసిన తరువాత ఆత్మదృక్పథంతో జీవిస్తాం
నిజమైన ఆధ్యాత్మిక సంఘాలలో, నిజమైన ఆధ్యాత్మిక వ్యవస్థలలో సంఘర్షణలు వుండవు... ఎందుకంటే ఆయా సంఘాలలో, ఆయా వ్యవస్థలలో వుండేవారు అందరూ **మాధవులే** అందరూ ధ్యానాభ్యాసం చేసిన వారే ... చేస్తూన్నవారే
వారిది **"మానవుల కూటమి"** కాదు ... వారిది **"మాధవుల కొలువు"**
**"న"** పోయి **"ధ"** రావాలి
**"న"** అంటే "లేకపోవడం" ... **"న"** అంటే "నెగెటివిటీ" ..
"న" అంటే "నకారాత్మకత" .. **"ఆత్మ అన్నది లేదు"** అన్న నకారాత్మకత
**"ధ"** అన్నది **"ధ్యానం"**కు సూచిక
"ధ" అంటే **"ధీ"** కు సూచిక
**"ఆత్మ అన్నది వున్నది .. అది మనమే"** అన్నదే **"ధీతత్వం"**
సకారాత్మక బుద్ధిని "ధీ" అంటాం.
మా " న " వుడు + **ఆధ్యాత్మికత** = మా " ధ " వుడు
మానవుడు మాధవుడుగా మారటమే **"ఆధ్యాత్మికత"**
**ఆధ్యాత్మికతకు మాధ్యమాలు మూడు**
**ధ్యానం–** ఆనాపానసతి... శ్వాస మీద ధ్యాస
**స్వాధ్యాయం –** న్యూ ఏజ్ ఆధ్యాత్మిక గ్రంధాల అధ్యయనం
**సజ్జన సాంగత్యం –** ఆత్మ సత్యం అనుభవపూర్వకంగా తెలిసిన వారితో అనునిత్య గోష్ఠి
ఈ **2013** సంవత్సరం నుంచి ఈ భూ మండలం ఒక నవ్య దివ్య భవ్య యుగంలో ప్రవేశించింది.
ప్రతి మానవుడు ..ఇక.. ఒక మాధవుడు కావల్సిందే
ప్రతి మానవుడూ ధ్యాన, స్వాధ్యాయ మరి సజ్జన సాంగత్యాదులలో తేలియాడాల్సిందే
భూ మండలంలో **"సంపూర్ణ ఆధ్యాత్మిక జగత్"**కు స్వాగతం, సుస్వాగతం.
సృష్టి విశాలం; కోటానుకోట్ల విశ్వాలతో కూడి వున్నది. సృష్టి చరిత్రలోనే ప్రస్తుతం భూమి మీద జరుగుతూన్న ఈ **"మహత్ పరిణామం"**లో ..
**"మహా ఆధ్యాత్మిక విప్లవం"** అనే విస్ఫోటంలో...
పాల్గొనే అదృష్టం మనకు మనం కల్పించుకున్నాం.
పిరమిడ్ మాస్టర్లందరికీ విశేషంగా అభినందనలు

**– బ్రహ్మర్షి పత్రీజీ**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటిభాగం) | రూ.100/- | 22) త్రివిధాలు | రూ.60/- |
| 2) జీవితశాస్త్రం (రెండవభాగం) | రూ.130/- | 23) ధ్యానం (పత్రీజీ) | రూ.60/- |
| 3) జీవిత సత్యాలు | రూ.100/- | 24) ధ్యానం వల్లనే జ్ఞానం | రూ.60/- |
| 4) భగవంతుడంటే | రూ.130/- | 25) అతీంద్రియ శక్తులు | రూ.60/- |
| 5) సత్యమార్గం | రూ.130/- | 26) శాస్త్రాల అర్థం- అంతరార్థం | రూ.60/- |
| 6) ఆత్మ శాస్త్రం | రూ.130/- | 27) ఆశ్చర్యం... ఆశ్చర్యం | రూ.50/- |
| 7) ధ్యాన శాస్త్రం | రూ.100/- | 28) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | రూ.60/- |
| 8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | రూ.130/- | 29) మౌన ధ్యానం | రూ.40/- |
| 9) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | రూ.130/- | 30) ఈ జీవితం ఎందుకు? | రూ.50/- |
| 10) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | రూ.130/- | 31) నిర్వాణ మార్గం | రూ.50/- |
| 11) ధ్యాన శక్తి | రూ.100/- | 32) షిరిడీసాయి సందేశాలు | రూ.40/- |
| 12) తెలుసుకోండి | రూ.120/- | 33) భాగవత సన్నివేశాల అంతరార్థం | రూ.40/- |
| 13) జీవిత సూక్ష్మాలు | రూ.120/- | 34) భూతదయే దైవత్వం | రూ.60/- |
| 14) గీతాసందేశం | రూ.100/- | 35) ఆలోచించండి | రూ.60/- |
| 15) కర్మ సిద్ధాంతం | రూ.80/- | 36) సంకల్పమంటే? | రూ.50/- |
| 16) బ్రహ్మజ్ఞానం | రూ.60/- | 37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) | రూ.30/- |
| 17) ఆత్మజ్ఞానం ఎందుకు? | రూ.70/- | 38) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | రూ.20/- |
| 18) ధ్యానమంటే ? | రూ.50/- | 39) శాకాహారమే మానవాహారం | రూ.15/- |
| 19) జ్ఞాన జ్యోతి | రూ.70/- | 40) అహింస మరియు శాఖాహారం | రూ.15/- |
| 20) జ్ఞాన కుసుమాలు | రూ.70/- | | |
| 21) దుఃఖ నివారణామార్గం | రూ.60/- | | |

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తి వారి వీధి, భీమవరం-534 201. (ప॥గో॥జిల్లా.)

ఫోన్ : 9490171853, సెల్ : 9440309812


ఈ రోజు నీవు
నీ ఆత్మ కోసం
ఏమి
చేశావు?
ధ్యానమే నీ ఆత్మకు
లాభించేది
ధ్యానం అంటే
శ్వాస మీద ధ్యాస
పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా
రూ.10/-
© Science Photo Library